క్లుప్తంగా

సమస్యలుంటే తెలపాలి



మాట్లాడుతున్న అర్పిత మారంరెడ్డి

లక్సెట్టిపేట: సబ్ జైల్‌లో సమస్యలుంటే తెలుపాలని లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ అర్పిత మారంరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సబ్ జైలులో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ సమావేశంలో మాట్లాడారు. న్యాయవాదులను పెట్టుకోవడానికి స్థోమత లేని ఖైదీలకు లీగల్ సర్వీస్ ద్వారా న్యాయవాదిని సమకూరుస్తామని తెలిపారు. అవసరమున్న ఖైదీల వివరాలు తెలుపాలని కోరారు. ఎక్కువ కాలం జైలులో ఉన్నవారి వివరాలు తెలుపాలని సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మాట్లాడుతూ.. ఖైదీలు జైలు పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. అనంతరం ఖైదీలకు చట్టాలు, లీగల్ సర్వీస్ అథారిటీపై అవగాహన కల్పించారు. జైలులోని గదులు, పరిసరాలను పరిశీలించారు. జైలర్ స్వామి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రవీందర్, న్యాయవాదులు, సిబ్బంది ఉన్నారు.

రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు

కాసిపేట: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎం21 (21వ శతాబ్ద బహుజన ఉద్యమం) ఆధ్వర్యంలో రాజ్యాంగంపై అవగాహన, ఓటు హక్కు విషయంపై ఇంటర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో జూనియర్ కళాశాలతో పాటు మోడల్‌స్కూల్ ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఎం21 మండల ఇన్‌చార్జి పల్లె మల్లయ్య మాట్లాడుతూ.. అంబేద్కర్ దేశంలోని ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం కల్పించేందుకు రచించిన రాజ్యాంగంలో పౌరుల విధులు, బాధ్యతలు, హక్కుల విషయమై అవగాహన కల్పించేందుకు ఎం21 పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కాలేజీ ఆవరణలో శనివారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్, ఎం21 జిల్లా ఆపరేషన్ టీం సభ్యుడు కొమ్ముల బాపు, మద్దివేణి చిన్నభీమయ్య పాల్గొన్నారు.

'ఓటరు ప్రలోభాలకు లోనుకావొద్దు'

జైపూర్: ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లోను కావొద్దని జైపూర్ ఎస్సై ఉపేందర్ రావు సూచించారు. బస్టాండ్ ఆవరణలో శుక్రవా రం ఓటర్లకు అవగాహన కల్పించారు. 30న జరిగే సాధారణ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపా రు. పోలింగ్ కేంద్రాలకు 200మీటర్ల దూరంలో ప్రచారాలు చేయొద్దని పార్టీ జెండాలతో పోలింగ్ కేంద్రాలకు రావొద్దని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా మద్యం, డబ్బులు పంపిణీ చేసినట్లు తెలిస్తే సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలి

దండేపల్లి: ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దివ్యాంగుల సంక్షేమానికి కృషిచేయాలి. ప్రత్యేక బడ్జెట్ కేటాయించడంతో పాటు, స్వయం ఉపాధికి వందశాతం సబ్సిడీ రుణాలు అందించాలి. నడవలేని వారికి ఈ బైక్స్, చేతి కర్రలు, వీల్ చైర్స్ అందించాలి. బోగస్ పింఛన్ దారులను ఏరివేయాలి. అర్హులైన వారికి పింఛన్లు అందించాలి. సదరం సర్టిఫికెట్స్ జారీకి మండల స్థాయిలోనే ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి యాభై శాతం టికెట్ కాకుండా పూర్తి ఉచిత ప్రయాణాన్ని కల్పించాలని దివ్యాంగ ఓటర్లు డిమాండ్ చేస్తున్నారు

దివ్యాంగుల సమస్యలపై దృష్టి పెట్టాలి



ఓటు అనే వజ్రాయుదంతో ఎన్నుకోబడి పాలకులు, అన్ని వర్గాల ప్రజలతో పాటు దివ్యాంగుల సమస్యలపై దృష్టి సారించాలి. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. వైకల్యాన్ని బట్టి వారికి ప్రభుత్వ పరంగా అన్ని రకాల బెనిఫిట్స్ అందించాలి.

\- కిషన్, దండేపల్లి

అర్హులకే అందించాలి..



బోగస్ పింఛన్లు ఏరివేయాలి. పింఛన్‌దారుల ఇబ్బందులను గుర్తించి, సమస్యలు పరిష్కరించాలి. బోగస్‌తో చాలా చోట్ల అర్హులకు అన్యాయం జరుగుతోంది. నడవరాకున్నా ప్రతి సారి ఓటు హక్కు వినియోగించుకుంటున్నా. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా, స్వచ్ఛందంగా ప్రతి ఎన్నికల్లో ఓటు వేస్తున్నా.

\- కొట్టె గోపయ్య, రెబ్బనపల్లి

ఓటు హక్కు వినియోగించుకుంటున్నా..



నాకు నడవడానికి రాదు. అయినా కూడా మూడు చక్రాల బండిపై వెళ్లి ఓటు హక్కును సమర్థవంతంగా వినియోగించుకుంటున్నాను. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి. ప్రజాప్రతినిధులుగా గెలుపొందిన వారు దివ్యాంగులను గుర్తించి వారికి సరైన న్యాయం చేయాలి. అన్నింటా ప్రత్యేక రిజర్వేషన్ కల్పించేలా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలి. మండల స్థాయిలో సదరం శిబిరాలు నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

\- సుజాత, దండేపల్లి

ఇంటి వద్దనే ఓటేశారు..



ప్రశాంత్‌కు సిరా గుర్తు పెడుతున్న సిబ్బంది



వృద్ధురాలితో ఓటు వేయిస్తున్న అధికారులు

దండేపల్లి/నెన్నెల/వేమనపల్లి: ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వయోవృద్ధులు, దివ్యాంగులు శుక్రవారం ఇంటి వద్దనే ఓటు వేశారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు తోట ప్రశాంత్ వద్దకు ఎన్నికల సిబ్బంది వెళ్లగా ఓటు హక్కు వినియోగించుకున్నాడు. నెన్నెల మండలం నార్వాయిపేటకు చెందిన దివ్యాంగుడు, చిన్నవెంకటాపూర్‌కు చెందిన 83ఏళ్ల వృద్ధురాలు తమ ఇంటి వద్దనే ఓటు వేశారు. వేమనపల్లి మండలంలోని ఏడు గ్రామాల్లో అధికారులు హోం ఓటింగ్ నిర్వహించారు. సూరారం, మామడలో ఇద్దరు చొప్పున, సుంపుటం, కాటేపల్లి, కల్మలపేట, క్యాతన్‌పల్లి, బద్దంపల్లిలో ఒక్కొక్కరు 80ఏళ్లు పైబడిన వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఓ విజయ్‌కాంత్, ఏపీఓ కుమారస్వామి, ఓపీఓ రాకేష్‌కుమార్, మైక్రో అబ్జర్వర్ కమలాకర్, పోలీస్ ఆఫీసర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు సిరాజ్, జాఫర్ ఆలీ, బీఎల్‌ఓలు స్వరూప, దేవిక, పరమేశ్వరి, సరోజ పాల్గొన్నారు.

ఫిర్యాదుల నంబర్ స్విచ్ ఆన్

- స్పందించిన సివిల్ సప్లయ్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలఅగ్రికల్చర్: ధాన్యం సేకరణలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు జిల్లా పౌరసరఫరాల శాఖలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూం ఫిర్యాదుల నంబర్ స్విచ్ ఆఫ్ అయింది. దీనిపై 'నిరుపయోగంగా కంట్రోల్ రూం' శీర్షికన సాక్షి దిన పత్రికలో శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. కంట్రోల్ రూం ఫిర్యాదుల నంబర్ 63039 28682ను వినియోగంలోకి తీసుకువచ్చారు. జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తుండగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ధాన్యం సేకరణ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడం, ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉంటుండడంతో కనీసం కాల్‌సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులైనా స్వీకరించి సమస్యలు పరిష్కరించడంలేదని వాపోతున్నారు. కాగా, కంట్రోల్‌రూం ఫిర్యాదుల నంబర్ అందుబాటులోకి రావడంతో రైతులు హర్షం వ్యక్తం జేస్తున్నారు. టార్పాలిన్లు కావాలని, సెంటర్ ఎప్పుడు ప్రారంభిస్తారని కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకుంటున్నారు.

ప్రజలకు భరోసానిచ్చేందుకే కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తాండూర్: ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తాండూర్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అశోక్‌నగర్, కొత్తగుడిసెలు, తాండూర్‌లో శుక్రవారం పోలీసుల ప్రత్యేక బలగాలతో కవాతు, ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సంఘ విద్రోహక చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని, ప్రజలకు భరోసా కల్పించేందుకే కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాండూర్, మాదారం ఎస్సైలు రాజశేఖర్, అశోక్, ప్రత్యేక బలగాలు పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: ఎన్నికల సమయం సమీపిస్తున్నందున మండలంలోని పోలీసు బలగాలు శుక్రవారం పట్టణంలో కవాతు నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌక్ నుంచి పాత బస్టాండ్ వరకు పెద్ద ఎత్తున బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని ఎన్నికల కోడ్ నిబంధనలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ క్రిష్ణ, ఎస్సై లక్ష్మణ్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

- మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేంసాగర్‌రావు



శ్రీరాంపూర్: యూనియన్‌లో చేరిన వారితో ప్రేంసాగర్‌రావు అభివాదం

శ్రీరాంపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు తెలిపారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం యూనియన్ సమావేశం జరిగింది. ఆర్కే 7గనికి చెందిన టీబీజీకేఎస్ నాయకులు బుస్స రమేశ్, ఐరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత సింగరేణి స్థలాల్లో ఇంకా పట్టాలు రాని వారికి పట్టాలిప్పిస్తామన్నారు. కార్మికులకు మరిన్ని సదుపాయాలు, హక్కులు కల్పిస్తామన్నారు. సమావేశంలో ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, బ్రాంచీ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, బ్రాంచీ నాయకులు పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు'

మంచిర్యాలటౌన్: వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టనున్నారని, మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీదే గెలుపని ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీపీఐ, ఏఐటీయూసీ సంయుక్త జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో జరిగిన విద్యావేత్తలు, టీచర్స్, లెక్చరర్స్, మేధావుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని, వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మామిడిశెట్టి వసుంధర, రమేశ్ దంపతులు బీఆర్‌ఎస్ పార్టీని వీడి ప్రేంసాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

ముస్లింలకు అండగా కాంగ్రెస్

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని, ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం వారికి అండగా నిలుస్తుందని ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని అన్ని మసీదుల వద్దకు వెళ్లి నమాజ్ అనంతరం వారిని కలిసి, ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు.



వసుంధర, రమేశ్‌తో ప్రేం సాగర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని రాపల్లికి చెందిన గ్రామ మాజీ ఉప సర్పంచ్ నర్సయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు శంకరయ్య, నాయకులు ఏనుగు మహిపాల్‌రెడ్డి, ఏనుగు జితేందర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీలో చేరగా ప్రేంసాగర్‌రావు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

గెలిపిస్తే ఆదాయ పన్ను మాఫీ

- మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

శ్రీరాంపూర్: ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మాఫీ చేయిస్తామని మంచిర్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్, స్టోర్స్, టింబర్ యార్డులలో కార్మికులను కలిసి శుక్రవారం ఓట్లు అడిగారు. సింగరేణి కార్మికులకు ఆధాయ పన్ను వల్ల ప్రతి నెలా కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల జరిగిన మందమర్రి సభలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ఆదాయ పన్ను మాఫీ చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇది అమలైతే ప్రతి కార్మికుడికి నెలకు రూ.5000 మేలు జరుగుతుందన్నారు. సింగరేణి కార్మికులకు మరిన్ని హక్కులు, సదుపాయాలు రావాలంటే కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావాలన్నారు. అనంతరం టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులకు జాతీయ సంఘాలు, గత ప్రభుత్వాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను ఇప్పించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. రక్షించుకోవాలంటే బీఆర్‌ఎస్‌ని అధికారంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు అన్నయ్య, మంద మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్ రెడ్డి, బ్రాంచీ నాయకులు వెంగళ కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్, మహిపాల్ రెడ్డి కానుగంటి చంద్రయ్య, జగదీశ్వర్ రెడ్డి, ఫిట్ సెక్రెటరీలు వెంకటేశ్వర్లు మహేందర్ రెడ్డి, నీలం సదయ్య, నాయకులు అన్వేష్ రెడ్డి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్, మహారాష్ట్ర ఎమ్మెల్యే అశోక్ ఓకే



చెన్నూర్ బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న దుర్గం అశోక్

చెన్నూర్: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందని చెన్నూర్ బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్ అన్నారు. చెన్నూర్ బీజేపీ కార్యాలయంలో మహారాష్ట్ర ఎమ్మెల్యే అశోక్ ఓకేతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ జెండా ఎగరవేస్తుందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం, ఆడబిడ్డ పుడితే రెండు లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ ఇస్తుందన్నారు. వరి రూ.3వేల గిట్టుబాటు ధర చెల్లిస్తుందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు హైదరాబాద్‌లో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండరన్నారు. ఈ ఇద్దరి వ్యవహారం ప్రజలకు తెలుసన్నారు. బీజేపీ మేనిఫెస్టోతోనే చెన్నూర్‌లో భారీ మెజార్టీతో గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌గౌడ్, రాపర్తి వెంకటేశ్వర్, ఏతం శివకృష్ణ, పెండ్యాల శ్రీకాంత్, తలారి రాజు, వంశీగౌడ్, గడ్డం మహేశ్, ఆలం బాపులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్ కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఎమ్మార్పీఎస్ మందమర్రి మండల ఇన్‌చార్జి జీడి సారంగం ఆధ్వర్యంలో శుక్రవారం పొన్నారం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు. బీజేపీని గెలిపిస్తేనే పేదల బతుకులు బాగుపడతాయని, ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్



ఖానాపూర్: బావాపూర్‌లో మాట్లాడుతున్న జాన్సన్

ఖానాపూర్: ఎమ్మెల్యేగా ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని దాసునాయక్‌తండా, బావాపూర్(ఆర్), రాజూరా, చందునాయక్ తండా, సింగాపూర్, ఎక్బాల్‌పూర్, తర్లపాడ్, పాతతర్లపాడ్, సత్తనపల్లి, సేవానాయక్ తండా, రాంరెడ్డి పల్లె, బీర్నంది, రంగపేట గ్రామాల్లో ప్రచారం చేశారు. ఖానాపూర్ మండలంలోని పాతఎల్లాపూర్, గోసంపల్లె, గోడలపంపు, దిలావార్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుపతిగౌడ్, సంతోశ్‌గౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

పెంబి: మండలంలోని పుల్గంపాండ్రి గ్రామంలో బీజేపీ నాయకులు శుక్రవారం ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు పైడిపెల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నరేందర్‌రెడ్డి, సర్పంచ్ తా నాజీ, గోవింద్, సరోజ, కాశీరాం ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్, ఖానాపూర్ మున్నూరుకాపు సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ దండె విఠల్‌తోపాటు బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను శుక్రవారం సన్మానించారు. ఆయా సంఘ భవనాల్లో జరిగిన సమావేశాల్లో నాయకులు మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు.

జన్నారం: లంబాడా తండాలు ఏకమై జాన్సన్ నాయక్‌కు మద్దతు తెలపాలని ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రూప్‌నాయక్ తండాలో ప్రచారం నిర్వహించారు. పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దుర్గాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ప్రచారం చేశారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, డబుల్ బెడ్‌రూం పథకాలను వివరించారు.

పేదింటిబిడ్డనూ.. ఆదరించండి

- ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు



కలమడుగులో మాట్లాడుతున్న బొజ్జు

జన్నారం: పేదింటి బిడ్డను, ఇప్పటికి ఇందిరమ్మ ఇళ్లు, ఎకరం భూమితో కుటుంబాన్ని పోషించుకుంటున్న. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం అభివృద్ధి చేయడానికి నాకు అవకాశం కల్పించింది. ఈ పేదింటి బిడ్డను ఆదరించి ఎన్నికల్లో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. మండలంలోని కలమడుగు గ్రామంలో శుక్రవారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. గ్రామ ఉపసర్పంచ్ రాజగౌడ్ ఆధ్వర్యంలో 100మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి బొజ్జు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కలమడుగులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజశేఖర్, మోహన్‌రెడ్డి, శుభాష్‌రెడ్డి, శంకరయ్య, సుధాకర్ నాయక్, బాలరాజ్, రాజరావు, శ్రీకాంత్ ఉన్నారు.

ఘనంగా దుర్గామాత ఆలయ వార్షికోత్సవం



గనిపై పూజలు చేస్తున్న జీఎం మనోహర్, అధికారులు, నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై శుక్రవారం మైసమ్మతల్లి(దుర్గామాత) 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి చండీ హవనము, యజ్ఞం, శాంతిపూజలు నిర్వహించారు. మందమర్రి జీఎం మనోహర్ హాజరై దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి హోమంలో పాల్గొన్నారు. కార్మిక కుటుంబాలు ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం కార్మిక కుటుంబాలతో పాటు స్థానికులకు ప్రజాప్రతినిధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య, మాజీ మంత్రి గడ్డం వినోద్, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, గ్రూప్ ఏజెంట్ రాందాస్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, టీబీజీకేఎస్ ఏరియా నాయకుడు వొడ్నాల రాజన్న, ఫిట్ సెక్రెటరి శంకర్, హోమంలో రక్షణాధికారి సునిల్‌కుమార్, ప్రవీణ్, సోల్లంకి శ్రీనివాస్, మేదరి రాములు, నందయ్య, సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు.

మండల సభ వాయిదా



మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మయ్య

వేమనపల్లి: ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నారు. దీంతో శుక్రవారం వేమనపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరుకాలేకపోయారు. దీంతో కోరం లేక మండల సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మయ్య తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

భీమారం: మండలంలోని ధర్మారంకు చెందిన పోటు మోహన్ రెడ్డికి చెందిన గేదె శుక్రవారం విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందింది. పంట పొలాల వద్ద గల కంచెకి సర్వీస్ వైర్ తాకడంతో దానికి విద్యుత్ ప్రవహించిందని, అదే సమయంలో గేదె తీగలకు తాకడంతో అది అక్కడికక్కడే మృతి చెందిందని యజమాని తెలిపారు.